సరదా సరదాగా దసరా


సాలూరు: వేంకటేశ్వర స్వామిగా దర్శనమిచ్చిన కామాక్షమ్మవారు


సాలూరు: పంచముఖేశ్వర స్వామి ఆలయంలో లక్షరుద్రాక్షలతో శివలింగానికి చేస్తున్న ప్రత్యేక పూజలు


సాలూరు: చండీరూపంలో దర్శనమిస్తున్న జ్ఞానసరస్వతి దేవి


కుటుంబసమేతంగా పూజలు చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


పార్వతీపురం టౌన్: భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న కొత్తవలస నవదుర్గ

- ఘనంగా ముగిసిన దేవీ శరన్నవరాత్రులు

సాలూరు:

పట్టణం, మండలంలో విజయదశమిని పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. విజయదశమి సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా వారి వాహనాలను ముస్తాబు చేశారు. దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా పట్టణంలో కామాక్షమ్మ అమ్మవారు వేంకటేశ్వరా స్వామిగా, చండీరూపంలో జ్ఞానసరస్వతి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి లక్షరుద్రాక్షలతో ప్రత్యేక పూజలు చేశారు.

బలిజిపేట: శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ మేరకు బలిజిపేటమండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా అజ్జాడలో రామమందిరం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహం వద్ద అర్చకుడు ఫణికుమార్ పూజలు జరిపించారు. పూర్ణాహుతి, భవానీ ఇరుముళ్లు, ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

సాలూరు: అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై కలిగి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. విజయదశమి సందర్భంగా పట్టణంలోని తన గృహంలో వాహనాలకు భార్య, కుమారుడితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి సందర్భంగా ప్రజలందరికీ విజయం సిద్ధించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి వ్యక్తిగత, క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ బద్ధంగా పండగ

పార్వతీపురవ టౌన్: దసరా ఉత్సవాలను పట్టణవాసులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ మేరకు బైపాస్ కాలనీలో కొలువుదీరిన దుర్గా మంటపంతో పాటు కొత్తవలస, వెంకంపేట ప్రాంతాల్లో కొలువైన దుర్గాలయాలకు, స్థానికంగా ఉన్న ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ ఆలయాలకు మంగళవారం వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. మొక్కులు చెల్లించే క్రమంలో ఘటాలు, ముర్రాటలు సమర్పించారు. రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన అమ్మవార్లకు భక్తులతో సామూహిక కుంకుమార్చన, అభిషేకాలను అర్చకులు చేయించారు. పండగ నేపథ్యంలో బంధువుల రాకలతో సందడి నెలకొంది. ఈ క్రమంలో పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా శరన్నవరాత్రి అనుపోత్సవాలు

సీతానగరం: మండలంలో అత్యంత భక్తిశ్రద్ధలతో 9 రోజుల పాటు జరిగిన శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సువర్ణముఖినది, చెరువుల్లో అనుపోత్సవాలు ఘనంగా జరిగాయి. దుర్గాదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు మంగళవారం దర్శనమిచ్చారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఆటో ఆపరేటర్స్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ నుంచి శివాలయం వరకూ మేళతాళాలతో ఊరేగింపుగా వాహనాల్లో తరలించి సువర్ణముఖి నదిలో అనుపోత్సవం చేశారు. అలాగే మరిపివలసలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బి చిట్టిరాజు ఆధ్వర్యంలో వందలాది మందిభక్తులు దుర్గాదేవి అనుపోత్సవం నిర్వహించారు.


బలిజిపేట: అజ్జాడలో రామాలయం వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు ఫణి


పార్వతీపురం టౌన్: బైపాస్ కాలనీలో కొలువుతీరిన దుర్గా మంటపంలో పూజలు అందుకుంటున్న దుర్గామాత


సీతానగరం: ఆటోఆపరేటర్స్ అనుపోత్సవ వాహనంపై కొలువు తీరిన అమ్మవారు


సాలూరు: పట్టణ బైపాస్‌రోడ్డు వద్ద లారీలకు పూజలు చేస్తున్న యజమానులు తదితరులు

క్లుప్తంగా

రెండుగ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు ప్రారంభం


పైప్‌లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట, మరిపివలస గ్రామాల్లో ప్రారంభించిన ఇంటింటి కుళాయి పనులు నిర్దేశించిన గడువులోగా నిర్వాహకులు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్ కుమార్ కోరారు. ఆ రెండు గ్రామాల్లో జరుగుతున్న పనులపై మంగళవారం ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికుళాయి పనులతో పాటు లచ్చయ్యపేటలో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. అప్పయ్యపేటలో రూ.31 లక్షలతో 150 ట్యాప్‌లు, మరిపివలసలో రూ.31 లక్షలతో 290 ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు

పార్వతీపురంటౌన్: హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా పెన్షనర్స్, ఫ్యామిలీ పెన్షనర్స్, ప్రభుత్వ ఉద్యోగులు, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్ఆర్‌టీసీ ఉద్యోగులు , డిపెండెంట్స్‌కు ఉచిత కంటి పరీక్షలు వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి, విజయనగరం వారితో పార్వతీపురం పట్టణంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం కార్యదర్శి గణపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి నగదు రహిత ఆపరేషన్ సేవలు రైతు బజారు వెనుక గల విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలకు హాజరు కావాలనుకున్న వారు హెల్త్‌కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, వైఎస్సార్ హెల్త్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం తప్పకుండా తీసుకురావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. .

ఆలయ ప్రారంభోత్సవం


మజ్జిగౌరీదేవి సన్నిధిలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని గున్నతోటవలసలో మజ్జిగౌరీదేవి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో చల్లగా ఉండేలా దీవించమని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఘనంగా గ్రామదేవత పండగ


ఆకట్టుకున్న కోలాటం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో అసిరితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని శాసపు ప్రసాదరావు ఇంటి నుంచి ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. మేళతాళాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి వనంకు చేరుకున్నారు. గ్రామదేవత పండగకు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు, బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి తదితర గ్రామాల్లో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మద్యపానం ఆరోగ్యానికి హానికరం

వంగర: మద్యపానం హానికరమని రాజాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్సైలు ఎస్.పిచ్చేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయాలను అడ్డుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సారా తాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని, కుటుంబాలను వీధిన పడేయొద్దని సూచించారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


రొంపల్లి అయ్యప్పస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని రొంపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు పువ్వల నారాయణరావు, పువ్వల మురళీమోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతలతో పాటు ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన అయ్యప్పస్వామి సన్నిధి ప్రారంభోత్సవానికి జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే విచ్చేశారు. స్వామి సన్నిధిలో నిర్మించిన 18 మెట్లపై ఏర్పాటు చేసిన దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు సన్నిధి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

- చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర


నందబలగలోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చిన్నశ్రీను సోల్జర్స్ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర దంపతులు

తెర్లాం: జిల్లాలో చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర కోరారు. మండలంలోని నందబలగ గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయానికి సోమవారం తన భర్త బడ్డుకొండ ప్రదీప్‌నాయుడుతో కలిసి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు, పెద్దలు, కనకదుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె భర్త ప్రదీప్‌నాయుడుతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరినీ కనకదుర్గమ్మ చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. తమ సంస్థ పేరిట జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికైనా, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికైనా చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో తెర్లాం మండల మాజీ ఎంపీపీ యర్రా రామినాయుడు, సర్పంచ్ గిరిడిబిల్లి పైడితల్లి, ఉపసర్పంచ్ గుల్లిపల్లి శ్రీనివాసరావు, చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని సీఐ కె.మురళీధర్ తెలిపారు. సోమవారం పాలకొండ–వీరఘట్టం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన ఆయన అధిక లోడు, అతివేగంతో వాహనాలు నడపవద్దన్నారు. రోడ్డుపైకి వాహనాలతో వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. మద్యం తాగి వాహనం నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి అపరాద రుసుం విధించారు.

ఎంఆర్‌పీఎస్ ఆందోళన


ఆందోళన చేస్తున్న ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు

భామిని: ఎస్సీ వర్గీకరణ చేయాలని మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నేతలు, కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తీర్మానం ప్రవేశపెట్టి, ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందాకృష్ణ మాదిగ ఆలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మహాపాదయాత్రకు మద్దతుగా తాము ఈ కార్యక్రమం చేపట్టామని ఎంఈఎఫ్ అధ్యక్షుడు కవిటి నూకరాజు, ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు లోపింటి కృష్ణ, అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మహాపాదయాత్ర మహాసభకు అందరూ తరలిరావాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా హక్కులపై నినదించాలని పిలుపునిచ్చారు. అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

ఎంఈఓల సమస్యలపై మంత్రికి వినతి

పార్వతీపురంటౌన్: ఎంఈఓల వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా మండల విద్యాశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం పర్యటనకు విచ్చేసిన విద్యాశాఖ మంత్రిని సోమవారం కలిసి ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారాలను కల్పించాలని కోరామని తెలిపారు. అదేవిధంగా ఎంఈఓ 1–2లకు స్పష్టమైన జాబ్‌చార్ట్ ఉత్తర్వులు విడుదల చేయాలని, ఎంఆర్‌సీలకు ఇస్తున్న గ్రాంట్ రెండు లక్షల రూపాయలకు పెంచి, ఎంఆర్‌సీలకు నూతన భవనాలు నిర్మాణం చేయాలని, వాహన సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశామన్నారు. తమ వినతిపై విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎంఈఓల యూనియన్ జిల్లా నాయకులు ఎన్.నాగభూషణరావు, బడే జనార్దన నాయుడు, కె.కొండలరావు తదితరులు ఉన్నారు.

కోతకు సిద్ధంగా వరి పంట


లక్ష్మీపురంలో కోతకు సిద్ధంగా వరి పంట

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో రైతులు వరి పంట కోతకు సిద్ధమయ్యారు. బోర్లు, సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్, తోటపల్లి కాలువ పరిసర గ్రామాల రైతులు వరిఊభాలు ముందుగా చేయడంతో పంటకోతకు సిద్ధమైంది. దీంతో రైతులు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై మండల వ్యవసాధికారి ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా సాగునీటి వనరులున్న గ్రామాల రైతులు తేలిక పాటి రకాలవరి విత్తనాలు వేయడంతో నారు వేసిన 25 రోజులకే వరినారు తీసి ఊభాలు చేయడంతో పంటకోతకు వచ్చిందన్నారు. ఈ నెలాఖరులోగా 1.500 ఎకరాల్లో వరిచేను కోయనున్నట్లు చెప్పారు. వరిచేలు కోతకు రావడంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నామని తెలియజేవారు.

బస్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు


బస్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు వేస్తున్న సిబ్బంది

రాజాం: పట్టణంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ పక్కన ప్రభుత్వ స్థలంలో బస్‌స్టేషన్ భవన నిర్మాణానికి మంగళవారం కొలతలు వేశారు. ఇక్కడ బస్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పినిపే విశ్వరూప్ తదితరులు శంకుస్థాపన కూడా చేశారు. ప్రస్తుతం అన్ని అనమతులు రావడంతో 1.42 ఎకరాల స్థలంలో 10 ప్లాట్ ఫామ్‌లతో బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. 126 బస్సులు నిలిపేందుకు వీలుగా, రోజుకు సుమారు 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అనువుగా దీన్ని నిర్మిస్తున్నట్లు ఆర్‌టీసీ డీఈఈ టీవీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ ప్రమీలారాణి, ఆర్‌టీసీ సూపర్‌వైజర్ కంబాల అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఎంపీపీ కుంబురుక దీనమయ్య


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కుక్కిడి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటపాటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని క్రీడాప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు ఈ తరహా టోర్నమెంట్‌లు ఉపయోగపడతాయన్నారు. ఈ టోర్నీలో 8 గ్రామాలకు చెందిన జట్లు పోటీపడగా, రుషిణికాలనీ, బుడ్డదుగూడ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నాయి.